
సాక్షి
కాకినాడ
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి జిన్నా వెంకట లక్ష్మీనారాయణ దంపతులు (గుంటూరు) సోమవారం రూ.1,00,001 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
42.0° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	25.0
కాకినాడ	39.1	27.0
అమలాపురం	40.0	26.0

న్యూస్‌రీల్

పవన్ కల్యాణ్‌పై చర్మకారుడి పోటీ



నామినేషన్ పత్రాలతో భాస్కరరావు

పిఠాపురం: జనసేన అధినేత పవన్ **కల్యాణ్‌పై** పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు **ఇప్పటికే ఒక** ట్రాన్స్‌జెండర్ ప్రకటించగా.. తాజాగా **ఓ చర్మకారుడు** కూడా ఆయనపై పోటీకి **సిద్ధమంటున్నాడు**. డిగ్రీ చదువుకున్నా కానీ **కులవృత్తినే** నమ్ముకుని జీవనం సాగిస్తున్న ప**ట్టభద్రుడిని** కాబట్టే చట్ట సభలకు వెళ్లాలని నిర్ణ**యించుకున్నా**నని, అందుకే పిఠాపురంలో ఎమ్మె**ల్యేగా పోటీ** చేయడానికి నిర్ణయించుకున్నానని **అంటున్నారు** పిఠాపురానికి చెందిన చర్మకారుడు ఏ**డిద భాస్క**రరావు. పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్**ఆర్ కాలేజీ** వద్ద చెట్టు కింద 20 ఏళ్లుగా చెప్పులు **కుట్టుకుంటూ** జీవనం సాగిస్తున్న ఆయన స్వత**ంత్ర్య అభ్య**ర్థిగా బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి సోమవారం నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. రెండు రోజుల్లో నామినేషన్ దాఖలు చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సినీ యాక్టర్ పవన్ కల్యాణ్ ఇక్కడ పోటీ చేస్తున్నారని, ఎక్కడి నుంచో ఇక్కడకు వచ్చి అందరూ పోటీ చేస్తూంటే స్థానికుడిగా బీఏ పొలిటికల్ సైన్స్ చదువుకున్న తానెందుకు పోటీ చేయకూడదని అనిపించిందన్నారు. అందుకే నాలుగు నెలలుగా నియోజకవర్గ సమస్యలను పత్రికల ద్వారా సేకరించానన్నారు. పిఠాపురంలో ఇప్పుడు పవన్ పరిష్కరిస్తానంటున్న సమస్యలను తాను 4 నెలల క్రితమే గుర్తించానన్నారు. పేద కుటుంబానికి చెందిన వాడిని కాబట్టి, ప్రజల సమస్యలు తీర్చాలంటే చట్ట సభలే వేదిక అని తలచి పోటీలో ఉండాలనుకుంటున్నానన్నారు. తనకు తెలిసిన వారందరి మద్దతూ కోరుతున్నానని, చాలా మంది ముందుకు వస్తున్నారని అన్నారు. ఎలాగైనా పవన్ కల్యాణ్‌పై గెలుస్తాననే నమ్మకం తనకుందన్నారు. త్వరలో తాను కూడా ఓ మేనిఫెస్టో తయారు చేసుకుని, ప్రకటిస్తానని భాస్కరరావు తెలిపారు.



పిఠాపురం: అశేష జనవాహినితో నామినేషన్‌కు వెళ్తున్న వంగా గీత



ఆర్‌ఓ వద్ద నామినేషన్ దాఖలు చేస్తున్న వంగా గీత



కాకినాడ రూరల్: కన్నబాబు నామినేషన్ పర్వంలో అభిమానుల ర్యాలీ



నామినేషన్‌కు వెళ్తూ ఫ్యాన్ గుర్తు చూపుతున్న కురసాల కన్నబాబు

ముహూర్తం కుదిరింది

- కోలాహలంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్లు
- వేలాదిగా తరలివచ్చిన జనసందోహం
- కాకినాడలో ఆకట్టుకున్న భారీ ర్యాలీలు, గుర్రపు స్వారీలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: భారీ ర్యాలీలు.. డప్పు మోతలు.. గుర్రపు స్వారీలు.. జనసందోహంతో కిక్కిరిసిపోయిన రహదారులు.. కార్యకర్తలు, అభిమానుల కేరింతలు.. నామినేషన్ల ప్రక్రియ వేళ.. జిల్లాలో సోమవారం కనిపించిన సందడి వాతావరణం ఇది. నామినేషన్లకు మంచి ముహూర్తం కావడంతో.. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు.. భారీగా తరలివచ్చిన జనసందోహంతో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు వెళ్లి, నామినేషన్లు వేశారు. ఎటుచూసినా జనమే జనం అన్నట్టుగా ఈ కోలాహలం అట్టహాసంగా సాగింది. అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థులు సంప్రదాయంగా వస్తున్న సెంటిమెంట్‌ను అనుసరించి నామినేషన్లు దాఖలు చేశారు. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు ఒకేసారి నామినేషన్లు దాఖలు చేయడంతో పార్టీ జెండాల రెపరెపలతో పరిసర ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. వేలాదిగా తరలివచ్చిన జనసందోహంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఎక్కడ లేని ఉత్సాహం ఉరకలు వేసింది.

- **వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి రెండు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుకు అందజేశారు. చంద్రశేఖరరెడ్డి సతీమణి మహాలక్ష్మి కూడా మరో సెట్ నామినేషన్ వేశారు.** ముందుగా నిర్ణయించుకున్న ముహూర్తం 10.49 గంటలకు ద్వారంపూడి నామినేషన్ దాఖలు చేశారు. తొలుత సాంబమూర్తి నగర్‌లోని వైభవ వేంకటేశ్వర ఆలయానికి వెళ్లిన ద్వారంపూడి దంపతులు స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఆనంద భారతి గ్రౌండ్స్ వద్ద సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం నగరంలో భారీ వాహన, బైక్ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేసేందుకు బయలుదేరారు. వారిపై అభిమానులు దారి పొడవునా క్రేన్ల పై నుంచి పూలవర్షం కురిపిస్తూ, కేరళ ఛెండా వాయిద్యాలు, డప్పుల మోత, గుర్రపు స్వారీలతో సందడి చేశారు. రాజీనామా చేసిన మహిళా వలంటీర్లు కోకిల రెస్టారెంట్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద గుమ్మడికాయలతో దిష్టి తీసి స్వాగతించారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున వెంట రాగా యువత కేరింతలు కొడుతూ భారీ ర్యాలీతో నగరంలో సందడి చేశారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



కాకినాడ సిటీ: ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నామినేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న అశేష జనసందోహం

- కాకినాడ రూరల్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నామినేషన్ అట్టహాసంగా సాగింది. సెంటిమెంట్‌గా భావించే కాకినాడ వెంకట నగర్‌లోని పాత ఇంటి వద్దకు ఉదయం వెళ్లిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి కాకినాడ రెండో డివిజన్ వైద్య నగర్‌లోని తన నివాసం నుంచి ఉదయం 10 గంటలకు సర్పవరం జంక్షన్ వరకూ భారీ ర్యాలీతో బయలుదేరారు. జనసందోహం వెంట రాగా రూరల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్‌కు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సంప్రదాయం ప్రకారం కన్నబాబు బీసీ, ఎస్సీ, ఓసీల నుంచి ఒక్కొక్కరిని ప్రతిపాదకులుగా సంతకాలు తీసుకుని నామినేషన్ వేశారు. ఆయన వెంట తండ్రి సత్యనారాయణ ఉన్నారు.
- రాష్ట్రంలోనే హాట్ సీటుగా మారిన పిఠాపురం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ రెండు సెట్ల నామినేషన్లను పిఠాపు రం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి వద్ద దాఖలు చేశా రు. సెంటిమెంట్‌గా ఎరుపు రంగు చీర, పసుపు, కుంకుమ బొట్టు పెట్టుకుని నామినేషన్ వేశారు. తొలుత క్యాంపు కార్యాలయంలో పూజ చేసుకుని, పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళుతూ మార్గం మధ్యలో జై గణేష్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం చర్చి, మసీదులకు వెళ్లి ఆయా మత పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా ఆర్‌ఓ కార్యాలయం వరకూ సాగింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావడంతో నామినేషన్ ప్రక్రియ కోలాహలంగా సాగింది. కార్యక్రమంలో వంగా గీత భర్త విశ్వనాథ్, సిట్టింగ్ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.
- పెద్దాపురం టీడీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, తుని నుంచి ఆ పార్టీ అభ్యర్థి యనమల దివ్య కూడా నామినేషన్లు వేశారు.
- నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలి రోజు 5, రెండో రోజు 7, మూడో రోజు 6 నామినేషన్లు దా ఖలు కాగా, నాలుగో రోజైన సోమవారం జిల్లా లోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 14 మంది, కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నలుగురు కలిపి మొత్తం 18 మంది నామినేషన్లు వేశారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ తదితరులు

ఘనంగా సీతారాముల వనవిహారోత్సవం

అన్నవరం: రత్నగిరి క్షేత్రపాలకులు శ్రీ సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం స్వామి, అమ్మవార్ల వనవిహారోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు వెంట రాగా నవదంపతులు సీతారాములను ఊరేగింపుగా కొండ దిగువన గార్డెన్ వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ ప్రత్యేక సింహాసనాలపై సీతారాములను, సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని వేంచేయించి, పండితులు పూజలు చేశారు. నవదంపతులకు దేవస్థానం అధికారులు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల అనంతరం వనవిహారోత్సవం నిర్వహించారు.

నేడు శ్రీచక్రస్నానం

శ్రీరామ నవమి ఉత్సవాల ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం 8 గంటలకు పవర్‌హౌస్ వద్ద పంపా నదిలో సీతారాములకు శ్రీచక్రస్నాన మహోత్సవం నిర్వహించనున్నారు. నదిలో నీరు లేకపోవడంతో స్నానఘట్టాలకు దూరంగా నీరు ఉన్న చోట గుంత తవ్వి, అందులో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 నుంచి వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు.



సీతారాముల వన విహారోత్సవం నిర్వహిస్తున్న పండితులు

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీల్లో ఇద్దరి నియామకం

కాకినాడ సిటీ: ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఇద్దరిని పార్టీ జిల్లా స్థాయి పదవుల్లో నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాల యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాకి లక్ష్మణమూర్తిని పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శిగా నియమించారు. అలాగే మేడిబోయిన చంద్రశేఖర్‌ను పార్టీ యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా నియమించారు.

ఘనంగా సత్యదేవుని ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- నమూనా ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ
- పాల్గొన్న దేవదాయ కమిషనర్

అన్నవరం: సత్యదేవుని ఆలయ చరిత్రలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. సత్యదేవుని ఆలయం ముందు స్వర్ణ ధ్వజస్తంభం, జాతీయ రహదారిపై విశాఖపట్నం – విజయవాడ మార్గంలో డిగ్రీ కళాశాల సమీపంలో నిర్మించిన నమూనా ఆలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ఉదయం 10.48 గంటల సుముహూర్తంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠించారిలా..

రత్నగిరిపై స్వామివారి ఆలయంలోని అనివేటి మండపంలో ఉన్న ధ్వజస్తంభానికి ఉదయం 9 గంటలకు పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ ధ్వజస్తంభాన్ని పైకి లేపి ఆలయం ముందు శ్లాబ్‌కు ఉన్న రంధ్రం ద్వారా నిటారుగా నిలబెట్టి, చివర కలశలు ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠా పూజలను దేవస్థానం ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ దంపతులు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, నెల్లూరుకు చెందిన దాత దంపతులు, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ దంపతులు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కోసం తవ్విన గొయ్యిలో నవధాన్యాలు, నవరత్నాలు, పంచలోహాలు, నవపాషాణాలు వేసి, పూజలు చేశారు. తరువాత భక్తులు కూడా వివిధ నాణేలు, నవరత్నాలు సమర్పించారు. పాత ధ్వజస్తంభం పునాదిలో బయటపడిన 15.4 గ్రాముల బంగారు వస్తువులు, నవరత్నాల ఉంగరం, 850 గ్రాముల బరువైన రాగి రేకును కూడా కమిషనర్, ఈఓ పునాది గోతిలో వేశారు. దేవస్థానంలో డార్మెట్రీ నిర్మించిన దాత పెన్నాడ రాజామణి కూడా నవరత్నాలు, నవధాన్యాలు సమర్పించారు. అనంతరం భక్తులు జై సత్యదేవ అని భక్తిపారవశ్యంతో నినాదాలు చేస్తూండగా ధ్వజస్తంభాన్ని లాంఛనంగా క్రేన్ సహకారంతో అత్యంత చాకచక్యంగా ఆ గోతిలోకి దించి నిలబెట్టారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభాన్ని తాకేందుకు పలువురు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం యాగశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న అధివాస పూజలు, హోమాల పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. యాగశాల నాలుగువైపులా ప్రతిష్ఠించిన కలశాల్లోని పవిత్ర జలాలతో ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ నిర్వహించి, ప్రధానాలయంలోని స్వామి, అమ్మవారు, శంకరుల మూలవిరాట్టులు, ధ్వజస్తంభం, భక్తులపై జల్లారు. ఈ కార్యక్రమాల్లో విశ్రాంత వేద పండితులు ముష్టి కామశాస్త్రి, వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, వైదిక కమిటీ సభ్యుడు, వ్రత పురోహిత ప్రముఖుడు చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అర్చకులు సుధీర్, శర్మ తదితరులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఏఈఓ కృష్ణారావు, డీఈలు, రాంబాబు, ఉదయ్ పర్యవేక్షించారు. ధ్వజస్తంభానికి 20 రోజుల్లో బంగారు రేకు తాపడం చేయించనున్నట్టు దాత తెలిపారు.

నమూనా ఆలయంలో..

సరిగ్గా ధ్వజస్తంభం ప్రతిష్ఠించిన ముహూర్తానికే జాతీయ రహదారిపై రూ.4 కోట్లతో నిర్మించిన నమూనా ఆలయంలో కూడా కలశ ప్రతిష్ఠ, సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఉపాధ్యాయుల రమేష్, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, పరిచారకులు యడవిల్లి ప్రసాద్, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్‌లు నమూనా ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించి, పూజలు చేశారు. ఈఈ నరసింహారెడ్డి, డీఈ గుర్రాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్, భక్తులు

అదరగొట్టిన అమ్మాయిలు

- 'పది' ఫలితాల్లో బాలికలదే పైచేయి
- 83.09 ఉత్తీర్ణత శాతం నమోదు
- గత ఏడాదితో పోల్చితే మరింత పెరుగుదల

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అమ్మాయిలు అదరగొట్టారు. గత నెల 18 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించిన టెన్త్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 27,671 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో 22,993 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది ఉత్తీర్ణత శాతం 68.02 మాత్రమే కాగా, ఈ ఏడాది అది ఏకంగా 83.09 శాతానికి ఎగబాకడం విశేషం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో విజయబావుటా ఎగురవేయడం గమనార్హం. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు.

ప్రభుత్వ ప్రోత్సాహానికి ఫలితం

ప్రభుత్వ పాఠశాల అనగానే అత్తెసరు మార్కులతో ఉత్తీర్ణత అనే అభిప్రాయానికి ఈసారి విద్యార్థులు ఫుల్‌స్టాప్ పెట్టారు. చాలీచాలని గదులు, శిథిలావస్థకు చేరిన భవనాలు, కరువైన కనీస వసతుల వంటి సమస్యలకు గడచిన ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వినూత్న కార్యక్రమాలు అమలు చేశారు. మన బడి నాడు – నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారు. విద్యార్థులకు ఆసక్తి కలిగే రీతిలో బోధనలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. కాలికి వేసుకునే బూట్ల నుంచి చదువుకునే పుస్తకాల వరకూ అన్నింటినీ విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో తీర్చిదిద్ది, ఉచితంగా అందించారు. ఫలితంగా ఈసారి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సర్కారీ బడుల విద్యార్థులు సగర్వంగా తలెత్తుకున్నారు. తగినన్ని వసతులు, శిక్షణ, ప్రోత్సాహం అందించాలే కానీ.. కార్పొరేట్ స్థాయి చదువులకు తాము ఎందులోనూ తీసిపోమని నిరూపించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈసారి అధిక సంఖ్యలో 500కు పైగా మార్కులు సాధించారు. పునర్విభజన అనంతరం ఏర్పడిన కొత్త జిల్లాల్లో రెండోసారి నిర్వహించిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో గత ఏడాదితో పోలిస్తే కాకినాడ జిల్లా మెరుగైన ఫలితాన్ని నమోదు చేసింది.

ప్రణాళికాబద్ధంగా కృషి

ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయడంతో పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు నమోదు చేయగలిగారు. జిల్లా విద్యాశాఖాధికారిగా పిల్లి రమేష్ గత ఫిబ్రవరిలో బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచీ పదో తరగతి ఉత్తీర్ణత పెంపుపై దృష్టి కేంద్రీకరించారు. వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ నిర్ణయాలు అమలు తీరును పరిశీలించేందుకు ఎప్పటికప్పుడు పాఠశాలల తనిఖీలు చేపట్టారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంల నుంచి ఆర్‌జేడీ స్థాయి వరకూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) నాగమణి ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకత్వం చేశారు. అలాగే జిల్లా పరిషత్ తయారు చేసి, పంపిణీ చేసిన ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ఇటువంటి చర్యలన్నీ మెరుగైన ఉత్తీర్ణతకు దోహదం చేశాయని పలువురు హెచ్‌ఎంలు చెబుతున్నారు.

జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షల్లో 4,678 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. వీరితో పాటు మార్కులు తక్కువగా వచ్చాయనే అనుమానం ఉన్నవారు పునఃమూల్యాంకనం (రీ వెరిఫికేషన్) కోసం ఈ నెల 30వ తేదీ రాత్రి 11 గంటల్లోగా సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.



592 మార్కులు సాధించి, తల్లి దేవితో ఆనందం పంచుకుంటున్న జగ్గంపేట ప్రభుత్వ హైస్కూలు విద్యార్థిని జ్యోతిక దేవి అపూర్వ రమ్య

జిల్లాలో టెన్త్ ఫలితాలు ఇలా..

పరీక్షలకు రాసిన వారు	: 27,671
ఉత్తీర్ణులైన వారు	: 22,993
ఉత్తీర్ణత శాతం	: 83.09
ఫస్ట్ క్లాస్	: 18,039
సెకండ్ క్లాస్	: 3,479
థర్డ్ క్లాస్	: 1,475
పరీక్షలు రాసిన బాలికలు	: 14,079
ఉత్తీర్ణులు	: 12,035
బాలికల ఉత్తీర్ణత శాతం	: 85.48
పరీక్షలు రాసిన బాలురు	: 13,592
ఉత్తీర్ణులు	: 10,958
బాలుర ఉత్తీర్ణత శాతం	: 80.62

సమష్టి విజయం



పదో తరగతి పరీక్షల్లో జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారుల సమష్టి కృషి కారణమైంది. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అందుకనుగుణంగా బోధన చేపట్టాం. ఈ విజయంలో భాగస్వాములైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు అభినందనలు.

– పిల్లి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ

క్లుప్తంగా

ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌కు ఏడాది జైలు

గండేపల్లి: ఒక వ్యక్తి మృతికి కారణమైన ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌కు ఏడాది జైలు, రూ.3,000 జరిమానా విధించినట్టు గండేపల్లి ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. 2019లో జరిగిన ఈ ప్రమాద వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గండేపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఇప్పెర్ల రామకృష్ణ స్కూటీపై పొలంలోకి వెళుతుండగా గండేపల్లి శివారులో రాజ్ చెరువుకు సమీపంలోకి వచ్చేసరికి శ్రీకాకుళం వెళుతున్న ప్రైవేటు అంబులెన్స్ ఇతనిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. అప్పటి ఎస్సై బి.తిరుపతిరావు కేసు నమోదు చేయగా దర్యాప్తు అనంతరం ప్రమాదానికి కారణమైన అంబులెన్స్ డ్రైవర్ శ్రీకాకుళం రూరల్‌కు చెందిన పాలమూరి కొండలరావుకు సోమవారం పెద్దాపురం కోర్టు మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ జైలు, జరిమానా విధించినట్టు తెలిపారు.

బస్సు కాంప్లెక్స్‌లో ప్రైవేటు బస్సు ఢీ కొని మహిళ మృతి

సామర్లకోట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఒక కార్పొరేట్ కళాశాలకు చెందిన బస్సు సోమవారం రాత్రి ఢీ కొనడంతో మహిళ మృతి చెందిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక కరప చెరువు ప్రాంతానికి చెందిన ఇల్లపు దుర్గమ్మ (50) కాకినాడ వెళ్లడానికి బస్సు కాంప్లెక్స్‌కు వచ్చింది. ఆ సమయంలో ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు కాంప్లెక్స్‌లో మలుపు తిప్పుతూ దుర్గమ్మను ఢీ కొంది. దాంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఎస్సై మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండిలా..

- టెన్త్ విద్యార్థులకు ఈ నెల 30 వరకు అవకాశం
- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల
- మే 24 నుంచి జూన్3 వరకు పరీక్షలు
- త్వరలో టైమ్ టేబుల్ విడుదల

రాయవరం: పదవ తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను విద్యాశాఖ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. మార్కులు తక్కువ వచ్చినట్లు అనుమానం ఉన్నవారు పునఃమూల్యాంకనం (రీ వెరిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

హెచ్‌ఎంకు మాత్రమే ఫీజు చెల్లించాలి

ఈ ఏడాది పది పరీక్షలు రాసిన విద్యార్థులు పాసైనా/ఫెయిలైనా పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చు. రీ వెరిఫికేషన్/రీ కౌంటింగ్ కోసం మంగళవారం నుంచి ఈ నెల 30వ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రీ వెరిఫికేషన్/రీ కౌంటింగ్ ఫలితాలు వచ్చినా, రాకున్నా ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. జవాబు పత్రాల రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌ఎంకి మాత్రమే ఫీజును సమర్పించాలి. అన్ని రుసుము చెల్లింపులు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో మాత్రమే చేయాలి. సీఏఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఫీజు చెల్లింపులు ఆమోదించరు.

ముఖ్య సూచనలు

అభ్యర్థులు వారి దరఖాస్తులను సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు అటెస్టేషన్ చేయించి, సంబంధిత విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి. నేరుగా విజయవాడలోని డీజీఈ కార్యాలయం(ఎస్ఎస్‌సీ బోర్డు)కు పంపించరాదు. దరఖాస్తులు పోస్టు ద్వారా స్వీకరించరు. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోనవసరం లేదు. రీ వెరిఫికేషన్ అంటే పరీక్ష పేపర్లను తిరిగి మొత్తం మూల్యాంకనం చేయరు. ఇచ్చిన మార్కులను తిరిగి లెక్కిస్తారు. రాసిన సమాధానాలన్నింటికీ మార్కులు వచ్చాయా లేదా అని ధ్రువీకరిస్తారు. జవాబు పత్రంలో దిద్దని ప్రశ్నలు ఉంటే దిద్ది మార్కులు కేటాయిస్తారు. స్కానింగ్ చేసిన విద్యార్థి జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు. రీ కౌంటింగ్ విషయంలో మార్కుల మొత్తం మరోసారి కూడతారు. తప్పుగా కూడి ఉంటే సరి చేసి మార్కులు వేస్తారు. అంతేగాని పేపరు విద్యార్థికి ఇవ్వరు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ దరఖాస్తు ఇలా..

మే 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల టైమ్‌టేబుల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు త్వరలో ప్రకటించనుంది. వచ్చే నెలలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులకు ప్రతీ పాఠశాల హెచ్‌ఎం/సిబ్బంది అందుబాటులో ఉండాలని ఇప్పటికే డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష ఫీజును నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించే వీలుంది. మే ఒకటో తేదీ నుంచి 23వ తేదీ వరకు రూ.50ల అపరాధ రుసుంతో ఫీజును చెల్లించే వీలుంది.

ఫీజుల వివరాలు

చెల్లించాల్సిన ఫీజులను ఆన్‌లైన్‌లో ఆయా పాఠశాల హెచ్‌ఎం లాగిన్ ద్వారా చెల్లించాలి. డీడీలు స్వీకరించరు. రీ వెరిఫికేషన్ ఫీజుగా ఒక్కో సబ్జెక్టుకు రూ.1,000 చెల్లించాలి. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలి.

నాలుగు రోజుల్లో మార్కుల జాబితాలు

ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫస్టియర్ కోర్సుల్లో చేరేందుకు నాలుగు రోజుల తర్వాత మార్కుల జాబితాలను అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. సంబంధిత హెచ్‌ఎం స్కూల్ లాగిన్ నుంచి పాఠశాలల వారీగా మార్కుల మెమొరాండం, వ్యక్తిగత షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండానే నేరుగా అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్ఈఎస్‌యుఎల్‌టీఎస్.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ నుంచి ఫలితాలు, షార్ట్ మెమోలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఉత్తీర్ణులైన అభ్యర్థులందరికీ నిర్ణీత సమయంలో ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు సంబంధిత పాఠశాలలకు పంపిస్తారు. మార్చి–2024, ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థుల నామినల్ రోల్ ఈ నెల 24 నుంచి అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో అందుబాటులో ఉంచుతారు.

నన్నయ వీక్షిత్ భారత్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

రాజానగరం: దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీ 18వ ఫౌండేషన్ డేని పురస్కరించుకుని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన వీక్షిత్ భారత్ థీమ్ కార్యక్రమాలను వీసీ ప్రారంభించారు. శ్రీరాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కానవరం విద్యార్థులు ఉదయం యోగ ఆసనాలు వేయించి, యోగ సాధన ఆవశ్యకతను తెలియజేశారు. మధ్యాహ్నం వీక్షిత్ భారత్ 2047 థీమ్ ఓరియెంటెడ్ డాన్స్, మైమ్, స్కిట్స్‌లను క్యాంపస్, అనుబంధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించారు. సీటీఆర్ఐ డైరెక్టర్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆవిర్భావ లక్ష్యాలను నెరవేర్చే దిశగా యువత పయనించాలని సూచించారు. యూజీసీ వీక్షిత్ భారత్ జాబితాలో «నన్నయ»వర్సిటీ ఉండటం హర్షణీయమన్నారు. సీఎస్ఐఆర్ రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ జి. భగవాన్ నారాయణ రీసెర్చ్ మెథడాలజీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డాక్టర్ ఎస్.శేషారెడ్డి, డాక్టర్ రామచంద్రరాజు, డాక్టర్ సీహెచ్.సత్యనారాయణ, డాక్టర్ రామరాజు ప్రసంగించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

రూ.8.97లక్షల విలువైన 128.27 గ్రాముల ఆభరణాల స్వాధీనం

కొవ్వూరు: వివిధ చోరీలకు పాల్పడిన పాత నేరస్తుడైన చుక్కపల్లి బాబి అనే ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. అతని వద్ద నుంచి 128.27 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గతంలో కొవ్వూరులో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఒక ఇంటిలోను, ఆరికిరేవుల గ్రామంలో ఒక రేకుల షెడ్‌లోను, కుమారదేవం, పోలవరంలోను ఇళ్లల్లో పగటి పూట ఎవరూ లేని సమయంలో ఇళ్లల్లోకి చొరబడి విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుని పోయాడన్నారు. సోమవారం కొవ్వూరు ఏటిగట్టుపై ఉన్న శివాలయం ఎదురుగా ఉన్న వీధిలో నిందితుడు అద్దెకి ఉంటున్న ఇంటి వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. చోరీ సొత్తు విలువ రూ.8,97,190 ఉంటుందన్నారు. నిందితుడు గోపాలపురం మండలం భీమోలు గ్రామానికి చెందిన వాడన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. నిందుతుడిని అరెస్ట్ చేయడంలో ఎస్సై కె.జగన్మోహన్‌రావు, సిబ్బంది సహకరించారన్నారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

- మేళతాళ మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం
- విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా కాల్పులు
- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



గౌతమీ గోదావరిలో సాగిన స్వామివారి తెప్పోత్సవం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. స్వామి వారి కల్యాణోత్సవాలు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం వేదపండితులు శ్రీమాన్ ఖండవల్లి వర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చరణ నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వస్తి వచనం, కల్యాణోత్సవ ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం 6 గంటలకు సంకల్పం, ప్రధాన హోమాలు నిర్వహించారు. కేరళ వాయిద్యాలతో స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం గౌతమీ గోదావరి నదిలో విద్యుత్ దీపాలంకరణతో సుందరీకరించిన హంస వాహనంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహించారు. బాణసంచా కాల్పులు, భక్తజనం గోవింద నామస్మరణ నడుమ స్వామివారు ఉభయ దేవేరులతో గౌతమీ గోదావరిలో విహరించడాన్ని భక్తజనం తన్మయత్వంతో వీక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను రంజిపజేశాయి. ఈ కార్యక్రమాలను దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం గౌతమీ గోదావరినదిలో స్వామివారి చక్రస్నాన మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో వివరించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ సోమవారం ఒక వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన చోడవరపు పాపారావు(56) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధను భరించలేక ఆదివారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. పాపారావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో శ్రీ షిర్డీ సాయి ముందంజ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో శ్రీషిర్డీసాయి విద్యానికేతన్ రాజమహేంద్రవరం, కడియం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ టి. శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్య ఓరియంటేషన్‌తో 10 వ తరగతి చదివిన వి. ఉదయ రుషిత 600 మార్కులకు 593 సాధించి ప్రథమ స్థానంలో నిలువగా ఎన్.సాయి అక్షయ, బి.యశశ్విని 592 మార్కులు, ఎం. జాహ్నవి, ఎస్. దేవికృష్ణసిరి 591, ఎ. లోహిత్ కుమార్ 590 మార్కులు సాధించినట్లు వివరించారు. ఆరుగురు విద్యార్థులు 590కి పైగా మార్కులు సాధించగా, 24 మంది 580 మార్కులకు పైగా, 44 మంది 570కి పైగా మార్కులు, 75 మంది 550కి పైగా మార్కులు సాధించారు. హాజరైన మొత్తం 164 మంది విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయినట్లు తెలిపారు. విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్య అకాడమీ డీన్ కె. శ్రీనివాస్ అభినందించారు.



విద్యార్థులతో శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య


10వ తరగతి ఫలితాలలో తిరుమల విజయభేరి




10వ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె.రఘువీర్ 595 మార్కులు, కె.సుప్రియ 595 మార్కులు, ఏపీఆర్ సాయిశ్రీలత, బి.లలితరాణి, కె.సత్యభాస్కర్ 594 మార్కులు, టి.ప్రీతిశరణ్య, ఎం.ఇబ్రహీం 593మార్కులు, కె.అశ్రిత, ఎంవీఎల్ఏ వాత్సల్య, ఎం.గ్రీష్మశ్రీ, బియు.ప్రసాద్, పి.శ్రీతుల్య, జేవీఎస్ సత్యసాయిదత్త, వై.తేజస్వి, ఎస్.రంజిత్‌కుమార్ 592మార్కులు, వై.కృష్ణచైతన్య, ఎల్.వైష్ణవి, సీహెచ్.లోక్‌ప్రకాష్, ఎస్‌వీఎస్.శ్రీధర్, డి.చిన్మయి 591మార్కులు సాధించారన్నారు. 590పైన 34మంది విద్యార్థులు, 580పైన 223 మంది విద్యార్థులు, 570పైన 451మంది, 560పైన 642 మంది, 550పైన 779మంది, 500పైన 451మంది , 560పైన 642మంది, 550పైన 779మంది, 500పైన 1108 మంది విద్యార్థులు సాధించారని, 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను నున్న తిరుమలరావు, డైరెక్టర్ సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.


పదవ తరగతి ఫలితాల్లో ఆదిత్య ప్రతిభ



గన్ని సాయి సాత్విక్



వి.యశస్వి



కె.నేహాశ్రీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదవ తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ చూపారని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి సోమవారం తెలిపారు. విద్యార్థులు గన్ని సాయి సాత్విక్ 596 మార్కులు, వి.యశస్వి, కె.నేహాశ్రీ 595 మార్కులు ఎం.శశిఅస్మిత 594 మార్కులు సాధించారన్నారు. తమ విద్యాసంస్థల నుంచి పరీక్షలకు 1,014 మంది హాజరు కాగా 590కు పైగా 33 మంది, 585కు పైగా 115 మంది, 581కు పైగా 167 మంది మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్.వి.రాఘవరెడ్డి అభినందించారు.

11న జాతీయ లోక్ అదాలత్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మే 11వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేందుకు రెవిన్యూ, పంచాయతీరాజ్ అధికారులు తమ పరిధిలో ఉన్న రాజీ పడదగిన కేసులను గుర్తించాలని తొమ్మిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి తెలిపారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో ఆమె ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జిల్లా రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తొమ్మిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి రాజీపడదగిన జాబితాను అధికారులు సిద్ధం చేసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందించాలన్నారు. తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, గవర్నమెంటు ప్లీడరు సీహెచ్‌వీ ప్రసాద్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తొమ్మిదో అదనపు జిల్లా న్యాయమూర్తి మాధురి

విస్తృత తనిఖీల్లో మద్యం పట్టివేత

- 18 మంది అరెస్ట్
- రూ.2.06 లక్షల నగదు సీజ్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ, ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు అక్రమ రవాణాను పసిగట్టేందుకు దాడులు, తనిఖీల వేగాన్ని మరింత పెంచాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో జరిగిన దాడులు, తనిఖీల్లో అక్రమ రవాణాను అడ్డుకుని 18 మందిని అరెస్ట్ చేశారు. నగదు రూ.2.06 లక్షలు సీజ్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్‌లు, స్వాధీనాల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.

- అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 30 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 5.4 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- రావులపాలెంలో నిఘా బృందాలు వాహనాలను తనిఖీ చేసి రూ.2.06 లక్షల నగదును సీజ్ చేశారు.
- ఆలమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న అయిదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3,220 నగదు సీజ్ చేశారు. 4 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.
- రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు పోలీసు స్టేషన్ల పరిధుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి 70 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 18.03 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం, కొత్తపేట ముమ్మిడివరం ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 83 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 15.51 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు.
- ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలైన ఐ.పోలవరం మండలం మురమళ్ల,పశువుల్లంకలలో స్థానిక పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో కలసి సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించాయి. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజలతో పోలీసు అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా ఇస్తూ అవగాహన కల్పించారు.



ఐ.పోవవరం మండలం పశువుల్లంకలో స్థానికులతో సమావేశమై ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి